క్లుప్తంగా

వణుకూరు గ్రంథాలయంలో శతకాలపై బోధన



పెనమలూరు: వణుకూరు శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు సుమతీ శతకం, వేమన శతకం, నీతి శతకాలు, దాశరథి శతకాలపై విద్యార్థులకు బోధించారు. గ్రంథాలయ విశ్రాంత అధికారి అవిరినేని వెంకటేశ్వరరావు విద్యార్థులకు వివిధ శతకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖర్, మహిళా పోలీస్ వికల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



కంకిపాడు: పుస్తక పఠనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు శనివారం పుస్తక పఠనం, కథలు చదవటం, క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు మాధవరావు, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పోటీలను పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపించారు. పోటీలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకి వాసవి క్లబ్ నవ నిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో శనివారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వెంకట్ మస్తానయ్య సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మీడియా కన్వీనర్ కొప్పవరపు సూర్యనారాయణ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ నవ నిర్మాణ్ ఆధ్వర్యంలో వేసవి దప్పిక తీర్చడానికి గత కొద్ది రోజులుగా ప్రయాణికులకు మజ్జిగ, పుచ్చకాయ ముక్కలు అందించటంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా, ధ్యాన, ప్రాణాయామంలో శిక్షణ

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో ఈనెల 21వ తేదీ నుంచి యోగ, ప్రాణాయామం, ధ్యానంపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గాయత్రీ విహార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాస్, కె.నాగప్రసాద్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం (గోసాల) శాఖ నేరెళ్ల తులసీ మాధవ్ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 8 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు లోపు వారు ఎవరైనా శిక్షణ పొందొచ్చన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

ఉయ్యూరు: సామాజిక సేవతో ముందుకు సాగటమే ఉత్తమ పౌరుల లక్షణమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరులో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు జంపాన రవి, జంపాన శివయ్య ఆధ్వర్యంలో శనివారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వల్లభనేని నాని, కౌన్సిలర్ పూర్ణిమ ప్రారంభించారు. అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కోరారు.

23న పెనమలూరు విద్యార్థులకు ప్రభుత్వ సత్కారం


గుమ్మా ఉదయ్‌కిరణ్


మేకల తన్వింబు

పెనమలూరు: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రభుత్వం సత్కరించనుందని ఎంఈవో కనకమహాలక్ష్మి తెలిపారు. పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో పదవ తరగతిలో పెనమలూరు పాఠశాల విద్యార్థులు మేకల తన్వింబు 577 మార్కులతో రెండవ స్థానం, గుమ్మా ఉదయ్‌కిరణ్ 575 మార్కులతో మూడవ స్థానం వచ్చాడు. వీరిని ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రం, మెడల్ అందచేసి సత్కారం చేస్తారు. ఈ నెల 23వ తేదీన సత్కార కార్యక్రమం జరుగుతుందని, వివరాలు తరువాత ప్రకటిస్తామన్నారు.

జగనన్న ఆణిముత్యాలుకు నలుగురు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రకటించింది. దీనికి గన్నవరం నియోజకవర్గ స్థాయిలో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డి పూజిత 575 మార్కులతో గన్నవరం నియోజకవర్గం ఫస్ట్ సాధించి జగనన్న ఆణిముత్యాలు కింద రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందుకోనుంది. 571 మార్కులతో నియోజకవర్గంలో ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్న ఉంగుటూరు మండలం మానికొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పఠాన్ శాహిష్ట పర్వీన్‌కు రూ.10 వేలు ప్రోత్సాహకం మంజూరు కానుంది. 567 మార్కులతో నియోజకవర్గంలో తృతీయ స్థానం పొందిన ఆరుగొలను జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొడూరి మీనాక్షి హన్సిక, ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ ఖాజాబీలకు చెరో రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందుకోనున్నారు. ఈ నెల 25 తేదీన నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ లైన్‌మెన్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకిలో ఈ నెల 17వ తేదీన రామచంద్ర రెసిడెన్సీలో విద్యుత్ మరమ్మతులు చేయటానికి లైన్‌మన్ కె.వెంకటేశ్వరరావు విధులు నిర్వహించటానికి వెళ్లగా అదే వీధిలో ఉంటున్న వెలగా రమేష్, వెలగా కిషోర్ అతని విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై గంగూరు సబ్‌స్టేషన్ ఏఈ ఆర్.సూర్యనారాయణ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విధులకు ఆటంకం కలిగించిన ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

వరి గడ్డివామి దగ్ధం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని ఆర్బీహెచ్ కాలనీలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి వామి పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన మడా సాంబశివరావుకు చెందిన 8 ఎకరాల వరిగడ్డి వామి అగ్నికి ఆహుతైంది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరకుని మంటలను అదుపు చేశారు. ఫైర్ ఆఫీసర్ మోహనరావు నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది మంటలు సమీపంలోని ఇతర గడ్డివాములు, ఇళ్లకు వ్యాప్తించకుండా అరికట్టారు. ఈ ఘటనలో రైతు మడా సాంబశివరావుకు రూ.70 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా అంచానా. కాగా, అగ్నిప్రమాదం సంభవించటానికి కారణాలు తెలియరాలేదు.

చలివేంద్రాలు ప్రారంభం

ఎమ్మెల్యే వంశీ సౌజన్యంతో ఏర్పాటు



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్, సినిమాహాల్ సెంటర్, గాంధీచౌక్, మూడుబొమ్మల సెంటర్లలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆర్థిక సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య శనివారం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ..వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే వంశీమోహన్ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గన్నవరంలో ఒకేసారి నాలుగు వాటర్ కూలర్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సదుపాయలను సమకూర్చే వంశీమోహన్ ఎమ్మెల్యేగా ఉండడం ప్రజల అదృష్టంగా భావించాలని చెప్పారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ, మండల కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, పీఏసీఎస్ డైరెక్టర్ చిమట శ్రీనివాసరావు, పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో చెస్ పోటీలు

గన్నవరం రూరల్: ఆటలు విద్యార్థులలోని సృజనను వెల్లడి చేస్తాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులు చెస్ పోటీల్లో పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్ పోటీలు, పుస్తక పఠనం లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి నిర్వహించారు. పాఠకులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి జూన్ 2వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు 2వ తేదీ రాత్రి 7 గంటకు బస్టాండ్ నుంచి బయలుదేరి 3వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి దేవస్థానానికి చేరుకుంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం కాణిపాకంలో విఘ్నేశ్వర స్వామి దర్శనం, భోజన ప్రసాదం, సాయంత్రం శ్రీపురం గోల్డెన్ టెంపుల్, రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 4వ తేదీ ఉదయం అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం బయలుదేరి 5వ తేదీ ఉదయం 8 గంటలకు గన్నవరం చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర రూ.2,700గా నిర్ణయించామన్నారు. ఇతర సమాచారం కోసం సెల్ 87909 96090, 7382905633 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ



గన్నవరం: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి కూడా కీలక శాఖల అధికారులు హాజరుకావడం లేదు, ఇలాగైతే ప్రజా సమస్యలు ఏ విధంగా పరిష్కరమవుతాయని ఎంపీపీ అనగాని రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపీడీఓకు ఎంపీపీ సూచించారు. అనంతరం మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అందరూ విధిగా హాజరుకావాలని కోరారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి, జగనన్న కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి మండల పరిషత్ ద్వారా అవసరమైన సహాయ, సహకారాలు అందస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో ఉత్సాహం..ఉల్లాసం



ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. పద్యాలు, గేయాలు, ఆట పాటలు, క్రీడలు, పుస్తక పఠనంతో విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులు చదరంగం, క్యారమ్స్ క్రీడల్లో శిక్షణ పొందారు. ఆంగ్ల మాధ్యమ పుస్తక పఠనంపై అవగాహన, ప్రాధాన్యతలను వివరించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ వాడకం నియంత్రించాలి

కేసరపల్లి (గన్నవరం): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణను పాటించాలని కేసరపల్లి గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానిక పిలుపునిచ్చారు. గ్రామంలో శనివారం ప్రపంచ పర్యావరణ పరిరోణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు, హోటల్ నిర్వాహకులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ..నానాటికి పెరుగుతన్న ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర హానీ జరుగుతుందన్నారు. భవితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సచివాలయ, వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని పొంచి ఉందని ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో మిషన్ లైఫ్‌లో భాగంగా పంట కాలువలు, మురుగుబోదెల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించే పనులను శనివారం చేపట్టారు. ఈ పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, ముసిబోయిన మోహనకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ యజమానులు వివరాలు అందజేయండి

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో జగనన్న భూ హక్కు, భూరక్షణ పథకం కింద చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ మునిసిపల్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు వారి స్థలాల వివరాలు, సర్వే నంబర్, డాక్యుమెంట్లు సంబంధిత వార్డు సచివాలయాల్లో అడ్మిన్‌లకు అందజేయాలని సూచించారు. భూ వివరాలు నమోదు చేసిన వారికి ల్యాండ్ పార్సిల్ నంబర్లు జారీ చేస్తామన్నారు. భూ/స్థల యజమానులు ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో సహకరించాలని సూచించారు.